క్లుప్తంగా

నవోదయకు కోటిపల్లి విద్యార్థి ఎంపిక


నవోదయకు ఎంపికైన ధనప్రసాద్

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న కర్రి దుర్గా ధనప్రసాద్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. రానున్న విద్యా సంవత్సరంలో నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో చేరుతాడని హెచ్ఎం కేఆర్కే ప్రసాద్ తెలిపారు. కోటిపల్లి పాఠశాల నుంచి నవోదయకు ఎంపికవడం ఇది రెండోసారి అని ఆయన చెప్పారు. ప్రసాద్ ఎంపిక అవ్వడంపై ఎంఈఓ నాగరాజు, ఎంఈఓ 2 చోడిశెట్టి ఆంజనేయులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం


మహిళలకు డస్ట్‌బిన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ గోవిందరాజు

కె.గంగవరం: ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకరంగా ఉంటామని సర్పంచ్ చోడే గోవిందరాజు(దత్తుడు) అన్నారు. మండలంలోని యండగండి గ్రామ సచివాయలం వద్ద మంగళవారం మహిళలకు డస్ట్‌బిన్లను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గృహాల్లో ఉన్న తడిచెత్త, పొడి చెత్తను వేరు వేరుగా డస్ట్‌బిన్లలో ఉంచి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. ఇంటితో పాటు ఇంటి పరసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను ఉపయోగించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా ఎరువును తయారు చేసి పంట పొలాలకు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి జెమ్మి, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేసవిలో చిన్నారుల ఆరోగ్యం జాగ్రత్త

కాజులూరు: వేసవిలో చిన్నారుల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశా వలంటీర్లు, సిబ్బందికి వేసవి తీవ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వీలైనంత వరకూ తల్లిదండ్రులు చిన్నపిల్లలను ఎండలోకి వెళ్లకుండా నిరోధించాలన్నారు. వేసవి తీవ్రతకు పిల్లల్లో మినరల్స్, కార్బోహైడ్రేట్స్ తగ్గిపోయి నీరసించిపోతారన్నారు. వేసవికాలమంతా చిన్నారులకు ద్రవపదార్థాలు ఎక్కువగా తాగించడంతో పాటు, బార్లీగింజలు ఉడికించగా వచ్చిన నీరు, సబ్జాగింజలు నానాబెట్టిన నీరు, గ్లూకోజ్, కొబ్బరినీళ్లు వంటివి అందించాలన్నారు. సిబ్బంది ఈ విషయంపై ప్రజలకు తగిన అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది నరాళ రాజారావు, ఈ.లక్ష్మిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు

రామచంద్రపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలను అభ్యసన కేంద్రాలుగా సమూల మార్పులు చేస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ శాంతికుమారి అన్నారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రామచంద్రపురం ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న రెండో బ్యాచ్ పోషణ్ బీ-పఢాయీ బీ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్రాల్లోని చిన్నారుల మేధాశక్తిని పెంపొందిచడానికి, శారీరక, మానసిక, భావోద్వేగ కమ్యూనికేషన్ లక్ష్యంగా ఇస్తున్న పూర్తి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ రామచంద్రపురం ప్రాజెక్టు సూపర్‌వైజర్ వీవీ వరాహలక్ష్మి, సూపర్‌వైజర్లు కళ్యాణి, కె.నాగమణి, సత్యవతి, ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి ఆడిట్ గ్రామ సభలు

రామచంద్రపురం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రామచంద్రపురం మండలంలోని 25 పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ గ్రామ సభలు ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ఆదివారపుపేట, తాళ్లపాలం, భీమక్రోసుపాలెం, యనమదల, తాడిపల్లి గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. శ్మశానంలో మొక్కలు నాటించాలని, గతంలో వేసిన మొక్కలు చనిపోయాయని మళ్లీ వేయాలని, నూతన జాబ్ కార్డులు ఇవ్వాలన్న వినతులు ఈ గ్రామ సభల్లో అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ మోర్త ఈశ్వరరావు, పరిశీలకుడుగా ఈఓపీఆర్డీ ఎన్.షెలత్‌రాజు, సోషల్ ఆడిట్ డిస్ట్రిక్ట్ రిసోర్సుపర్సన్‌లు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

తెగులు.. రైతుల దిగులు

- ప్రస్తుత వాతావరణానికి దోమ, పొడ తెగులు ఆశించే అవకాశం
- పంట దిగుబడిపై అన్నదాతల ఆందోళన


పురుగు మందులు పిచికారీ చేస్తున్న రైతు

రాయవరం: ఖరీఫ్‌లో రైతులు ఆశించినంతగా దిగుబడి లేదు. రబీలోనైనా తమ ఆశలను తీర్చుకుందామని ఆశించిన అన్నదాతలకు ప్రస్తుత వాతావరణం కలవర పెడుతోంది. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా తెగుళ్ల ఆశించే అవకాశముందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అసలే నీటి కొరతతో సతమతమవుతున్న అన్నదాతకు పులి మీద పుట్రలా తెగుళ్ల ఆశిస్తున్నాయి. మబ్బులతో కూడిన గుబులు వాతావరణం కారణంగా తెగుళ్ల బెడద వెంటాడుతున్నాయి తెగుళ్ల ప్రభావం దిగుబడిపై చూపే అవకాశం ఉండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

1.01 లక్షల ఎకరాల్లో రబీ సాగు

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగును రైతులు చేపట్టారు. ఈ ఏడాది సరైన సమయంలోనే వరినాట్లు పడ్డాయి. ప్రస్తుతం వరిచేలు ఈనిక దశలో ఉన్నాయి. వరిసాగు జరిగిన 1.01 ఎకరాల్లో 90శాతం మేర ఎంటీయు 3626(బొండాలు) రకాన్ని, మిగిలిన 10శాతం మేర ఎంసీ13, కావేరి, పీఆర్ 125, విత్తనాల కోసం స్వర్ణ రకాలను సాగుచేస్తున్నారు.

కలవర పెడుతున్న వాతావరణం

ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మబ్బులతో కూడిన గుబురు వాతావరణం ఏర్పడుతుంది. గుబులు వాతావరణం తెగుళ్లకు అనుకూలం. గుబులు వాతావరణానికి దోమ వరి పంటను ఆశించే అవకాశముంది. కాండం వద్ద దోమ గుడ్లు పొదుగుతుంది. పిల్ల దోమ కాండాన్ని పట్టుకుని రసం పీలుస్తాయి. ఫలితంగా కాండంతో సహా ఆకులు పసుపురంగులోకి మారిపోతాయి. దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. ప్రస్తుత వాతావరణం కారణంగా పొడ తెగులు ఆశించే అవకాశముంది. గట్లపై ఉండే కలుపు మొక్కలపై శిలీంధ్రం ఆశించి దాని ద్వారా గట్ల వెంబడి ఉన్న వరి దుబ్బులకు సోకుతుంది. కాండం నుంచి ప్రారంభమై ఆకుల మీదకు శిలీంధ్రం వ్యాప్తి చెందడంతో ఆకులు గిడసబారి పోతాయి. ఫలితంగా దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

నివారణ చర్యలు ఇలా

దోమ నివారణకు పై వాతావరణంలో వేడి పెరిగి ఉక్కపోత పెరుగుతుంది. దీని కారణంగా దోమ ఉధతి అయ్యే అవకాశం ఉందని రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభ దశలో దోమను గమనిస్తే పైమెట్రోజైన్ 50శాతం డబ్ల్యుజీ 120 గ్రాముల మందును మోనోక్రోటో పాస్ 2.5 మిల్లీలీటర్ల మందును లీటరు నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారి చేయాలని వ్యవశాయశాఖాధికారులు

ఆశలన్నీ రబీపైనే

రైతులు రబీపైనే ఆశలు పెట్టుకున్నారు. నిన్నటి వరకు వాతావరణం అనుకూలించినా, ప్రస్తుతం గుబులు వాతావరణం తెగుళ్లకు కారణమవుతోంది. ముఖ్యంగా దోమ, పొడతెగులు వ్యాప్తి చెందే అవకాశముంది. ఈ తెగుళ్లు, పురుగులతోరబీలో కూడా నష్టాలు తప్పేటట్లుగా లేదు. ఖరీఫ్‌లో వచ్చిన నష్టాలను భర్తీ చేసుకుందామనుకుంటే తెగుళ్లు పంటను ఆశిస్తున్నాయి.

పంటను గమనిస్తూ ఉండాలి

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు నిత్యం పంటలను గమనిస్తూ ఉండాలి. తెగుళ్లు ఏమి ఆశిస్తున్నాయో చూసి, వ్యవసాయాధికారుల సూచనలకు అనుగుణంగా తెగుళ్ల నివారణకు రసాయన మందులు స్ప్రే చేయాలి. విచ్చలవిడిగా మందులు వినియోగించడం మంచికాదు.

28న మండల బడ్జెట్ సమావేశం

కపిలేశ్వరపురం: మండల బడ్జెట్ సమావేశం ఈనెల 28న నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి తెలిపారు. ఉదయం 10.30కి ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు.

‘ఆదరణ’తో బీసీలకు మేలు


కపిలేశ్వరపురంలో వృత్తిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: ఆదరణ పథకం ద్వారా బీసీ సామాజిక వర్గీయులకు మేలు కలుగుతుందని ఎంపీడీఓ కె.రత్నకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఆదరణ పథకం-3 అమలు తీరుపై అవగాహన సమావేశం నిర్వహించారు. మండలంలోని రజక, నాయీ బ్రాహ్మణ, చేనేత, తాపీమేస్త్రి, విశ్వబ్రాహ్మణ, టైలర్, కల్లుగీత తదితర వృత్తిదారులుకు పథకంలో లబ్ధి పొందే అవకాశాలను వివరించారు. ఆయా వృత్తుల నిర్వహణకు అవసరమైన పరికరాలు లభ్యమయ్యే విధానం, ప్రభుత్వ సాయం పొందే తీరుపై అవగాహన కల్పించారు.

ఆక్వా జోనేషన్ రీసర్వే రైతులకు లాభదాయకం


రీ సర్వే కోసం వివరిస్తున్న మత్స్యశాఖ అధికారి రమణరావు

మండపేట: ప్రభుత్వం చేపట్టిన ఆక్వా జోనేషన్ రీసర్వే ద్వారా ఆక్వా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి విళ్ల రమణరావు తెలిపారు. మంగళవారం రమణరావు ఆధ్వర్యంలో తాపేశ్వరం, ఇప్పనపాడు, కేశవరం గ్రామాలు, మున్సిపల్ పరిధిలోని 7, 9 సచివాలయాల వద్ద ఆక్వాజోన్ గ్రామ సభలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వేగుళ్ల నారాయణరావు(నారయ్యబాబు), 17వ వార్డు కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్యభవాని, గ్రామాల సర్పంచులు వాసంశెట్టి రాజేశ్వరి, కుంచె వీరమణి, పెదపాటి సత్తిబాబుల అధ్యక్షతన ఆయా గ్రామ సభలు జరిగాయి. రైతులు పాల్గొని తమ భూముల వివరాలు తెలిపారు. ఆక్వా జోనేషన్ రీసర్వేలో గతంలో ప్రచురించిన గెజిట్లో నమోదు కాని వ్యవసాయాన్ని భూములను గ్రామస్థాయి కమిటీల వివరాలు నమోదు చేశామని రమణరావు తెలిపారు. ఈ నివేదికను కలెక్టర్‌కు నివేదించిన అనంతరం ఆయన ఆదేశాల మేరకు నమోదైన భూములను పొటెన్షియల్ పరిధిలోకి తీసుకొస్తామని ఆయన అన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. రెవెన్యూ ఆర్ఐ వాసంతి, ఏవో ఏసుబాబు, ఇరిగేషన్ ఏఈ అజీజ్, మత్స్యశాఖ సహాయకుడు కృష్ణ కిషోర్, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మండపేట: ప్రజా సమస్యల పరిష్కారానికై మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజాదర్బార్ మొదలవుతుందని తెలిపారు. పట్టణ ప్రజలు తమ సమస్యలను ప్రజాదర్బారు ద్వారా తెలియ పరిస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు.

ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ రాయితీ

మండపేట: పెరిగిపోతున్న ఆస్తిపన్నుల బకాయిలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్నుపై 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తూ జీవో విడుదల చేసిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన ఆస్తి పన్ను గడువు ముగుస్తున్నందున ఇప్పటి వరకూ అసలు వడ్డీ చెల్లించిన వారికి కూడా ఈ నిబంధన వర్తించేలా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 50 శాతం వడ్డీ రాయితీ వర్తింపజేసి అందరికీ సమన్యాయం చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. వడ్డీ మొత్తం చెల్లించిన వారికి వచ్చే మొదటి విడత పన్ను వసూళ్లలో కట్టించుకున్న వడ్డీలో 50 శాతం మాఫీ చేసి సొమ్ముల వెనక్కి ఇవ్వాలని కోరారు. ఆస్తిపన్ను వసూళ్ల డిమాండ్ నోటీసులు కనీసం రెండు నెలల ముందు జారీ చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: పురపాలక సంఘం పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాలపై గల పన్ను బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీని ప్రకటించినట్లు కమిషనర్ ఒ.అయ్యప్పనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలకు మొదటి, రెండో అర్ధ సంవత్సరాలకు గాను డిసెంబర్ నెలాఖరుకు 2.5 శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది. అయితే పన్ను చెల్లింపుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు పురపాలక సంఘాల్లో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూళ్లను మెరుగుపర్చేందుకు ఈనెల 31 లోపు ఒకేసారి ఏకమొత్తంలో చెల్లింపులు చేస్తే చెల్లింపుదారులకు ఏకమొత్తంలో పన్నులను చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీని కల్పిస్తూ ప్రభుత్వం జీవోను జారీ చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

టిడ్కో గృహాలు ఖాళీగా ఉంటే వెనక్కి తీసుకుంటాం

- అర్హత ఉన్న వేరొకరికి ఇచ్చేస్తాం
- కమిషనర్ రంగారావు హెచ్చరిక


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

మండపేట: పట్టణంలోని గొల్లపుంత రోడ్డులో ఫేజ్-1లో ప్రభుత్వం కట్టి తాళాలు అప్పగించిన గృహాలు ఖాళీగా ఉంటే వాటిని తిరిగి వెనక్కి తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్లో మంగళవారం టిడ్కో, మున్సిపల్ అధికారులతో గృహాలపై సమీక్ష నిర్వహించారు. ఫేజ్-1 లో నిర్మించిన 4064 ఇళ్లకు గాను 3383 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి కాగా వాటిని అప్పగించామన్నారు. అందులో 2565 లబ్ధిదారులు ప్లాట్లలో నివాసముంటున్నారని తెలిపారు. ఇంకను 818 మంది తాళాలు అందుకుని ప్లాట్లలోకి వెళ్లకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన అన్నారు. ఖాళీగా ఉన్న ప్లాట్లు దుమ్ముదూళి పట్టి పాడైపోతుండడంతో పక్క నివాసితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలా పట్టించుకోకుండా ఉంటే ప్లాట్లు తిరిగి వెనక్కి తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ తిరిగి స్వాధీనం చేసుకున్న ప్లాట్లను అర్హత కలిగిన లబ్ధిదారులకు అప్పగిస్తామని హెచ్చరించారు. ఏవైతే ఖాళీగా ఉన్నాయో వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో టిడ్కో సీఎల్‌టీసీ జే బిందు, డీఈ కే శ్రీనివాస్, ఏఈలు పవన్‌కుమార్, బీ ఆంజనేయులు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, వార్డు ప్లానింగ్, వెల్ఫేర్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయం వార్షికోత్సవం

- రూ.2 లక్షలతో సీతారాములకు వెండి కిరీటం అలంకరణ


స్వామి వారిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి, రెడ్డి రాజబాబు

మండపేట: మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో ఉన్న సీతారాముల ఆలయ మొదటి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ(రాజబాబు) ముఖ్య అతిథిలుగా హాజరై స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వారికి ఆలయ కమిటీ విశేష పూజా కార్యక్రమాలు జరిపించారు. సంఘం నాయకుడు శ్రీరామ భక్తుడు కాదా శ్రీనుబాబు, సూర్యకుమారి దంపతులు స్వామి వార్లకు రూ.2లక్షలతో వెండి కిరీటాలు చేయించి బహూకరించారు. దాత తల్లిదండ్రులు కాదా చంద్రరావు, సత్యవతి దంపతులు కిరీటాలను అలంకరించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. శెట్టిబలిజ పేట, పాటిమీద, ధర్మగుండం చెరువు తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పిల్లి గనేశ్వరరావు, చాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, ఆ వార్డు వైఎస్సార్ ఇన్‌చార్జి శెట్టి నాగేశ్వరరావు, సంఘ నాయకులు పలివెల నాగేశ్వరరావు, నామాల సత్యనారాయణ, చొల్లంగి గోవిందు, సూరిబాబు, పెంకే గంగాధర్, యాండ్ర బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నీటి యాజమాన్య పద్ధతి పాటించాలి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ రవి

కె.గంగవరం: ప్రస్తుతం వరి పంట పొలాలు చిరు పొట్ట దశలో నుంచి వెన్ను పాలు పోసుకునే దశలో ఉన్నాయని ఇటువంటి సమయంలో రైతులందరూ తప్పక సరైన నీటి యాజమాన్యం చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి బలుసు రవి అన్నారు. మండలంలోని పామర్రులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు దోమ పరిస్థితిని గమనిస్తూ ఉండాలని, ఒకే పురుగు ఒకే మందు కాకుండా మందులు మార్చి మార్చి పిచికారీ చేయాలని తద్వారా వాటిని అరికట్టవచ్చన్నారు. మూడో పంటగా అపరాల సాగుకు రైతులు సమాయత్తం కావాలని సాగుకు కావాల్సిన పెసలు, మినుములు సబ్సిడీపై అందిస్తామన్నారు. భూసారం పెంచాలంటే అపరాలు, పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలని సూచించారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు


సత్యనారాయణరెడ్డి, అరుణకుమారి దంపతులను సత్కరిస్తున్న డీఈవో డాక్టర్ సలీం బాషా తదితరులు

రాయవరం: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తేనే మంచి గుర్తింపు లభిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా పేర్కొన్నారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన హిందీ పండిట్ పడాల సత్యనారాయణ రెడ్డి ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యకమం హెచ్ఎం సునీత అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. మూడు దశాబ్దాలుగా సత్యనారాయణరెడ్డి అందించిన సేవలను ఆయన ప్రశంసించారు. సమావేశంలో రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి, ప్రముఖ వైద్యులు డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, సర్పంచ్‌ల సమాఖ్య మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం సత్యనారాయణరెడ్డి, అరుణకుమారి దంపతులను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డీఈవో డాక్టర్ సలీం బాషా తదితరుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు కొవ్వూరి సత్యనారాయణ రెడ్డి గారు(సత్తిబాబు), తేతలి సుబ్బిరామిరెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, స్థానిక నేత ఉండవల్లి రాంబాబు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, ఎంఈవో వైవీ సూర్యనారాయణ తదితరులు చేతుల మీదుగా గజమాల, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కన్నులపండువగా వరుణేశ్వరస్వామి కల్యాణం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో వేంచేసియున్న బాలాత్రిపుర సుందరీ సమేత వరుణేశ్వరస్వామి కల్యాణ వేడుక మంగళవారం ఆలయ ప్రాంగణంలో కన్నులపండువగా నిర్వహించారు. దేవులపల్లి ఫణిరామకృష్ణ, కొంతేటి భీమశంకరం, కొంతేటి అప్పాజీల బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువుని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాలాత్రిపుర సుందరీ సమేత వరుణేశ్వరస్వామి కల్యాణ వేడుకని కనులారా తిలకించి స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

సాగునీటి ఇబ్బందులపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలి

కాజులూరు: సాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని రైతుసంఘం నాయకుడు, తణుకువాడ పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ తాడి వెంకటరెడ్డి తదితర రైతులు కోరుతున్నారు. మంగళవారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ గతంలో దాళ్వా సాగు చివరి దశలో సాగునీటి కొరత ఏర్పడేదన్నారు. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం మండల గ్రామాల మీదుగా ప్రవహించే డ్రెయిన్లకు క్రాస్‌బండలు ఏర్పాటు చేయించేసేదని, పరిసర రైతులు డ్రెయిన్‌లలో నిల్వఉన్న నీటిని ఆయిల్ ఇంజిన్లతో పంట పొలాలకు తోడుకునేందుకు వారికి ఇంజినాయిల్ సరఫరా చేసేదన్నారు. అయితే ప్రస్తుతం దాళ్వాసాగు తొలి దశలోనే సాగునీటి ఎద్దడి తలెత్తిందని దీంతో తూర్పుడెల్టా కాలువ నుంచి సాగునీటి విడుదల తగ్గిపోవటంతో గత 20 రోజులుగా కాలువ శివారు భూములలో ఉన్న కాజులూరు మండల గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి డ్రెయిన్లకు క్రాస్‌బండ్‌లు ఏర్పాటు చేసి ఇంజిన్‌ఆయిల్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

కాపు నేత సూర్యారావు మృతి


సూర్యారావు (ఫైల్)

మండపేట: స్థానిక కాపు అభ్యుదయ సంఘం గౌరవ అధ్యక్షుడు సిద్ధిరెడ్డి సూర్యారావు(86) సోమవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. ఈయన రావులచెరువు గట్టు వద్ద ఉంటున్న ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పట్టణ కాపు అభ్యుదయ సంఘం అభ్యున్నతికి ఈయన ఎనలేని సేవలు అందించారు. సీనియర్ రాజకీయ నాయకుడిగా ఈయన మాజీమంత్రి సంగిత వెంకటరెడ్డికి ప్రధాన అనుచరులుగా ఉండేవారు. తదనంతరం మాజీ ఎమ్మెల్యేలు వీవీఎస్ఎస్ చౌదరి, వల్లూరి నారాయణ రావులతోను సన్నిహితంగా వుంటూ పెద్దమనిషిగా చెలామణి అయ్యారు. ఈ నేపథ్యంలో వయోభారంతో ఈయన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఆయన మృతిపై కాపుసంఘం నాయకులు జిన్నూరి సత్యసాయిబాబా, వుంగరాల రాంబాబాబు, శిరంగు శ్రీనివాస్, శెట్టి నాగేశ్వరరావు, కురసాల సత్యనారాయణ, గోకరకొండ ప్రసాద్ తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేసి మంగళవారం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. జొన్నపల్లి సూర్యారావు, గోకరకొండ భీమరాజు, గంగుమళ్ల శ్రీను, సాధనాల శివ తదితరులు తమ సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు.

కుంగిపోతున్న ఏటిగట్టు రహదారి


కుమ్మరి సావరం వద్ద కుంగిన రోడ్డు

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి కుమ్మరి సావరం వద్ద ఏటిగట్టు కిందికి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలోపై వాహనాలు వచ్చేటప్పడు కుంగిన రోడ్డును గమనించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. పెద్ద వాహనాలు వెళ్లేటప్పుడు ఈ ప్రమాదాలు మరింత పెరిగి మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డును సరిచేయాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు

మండపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయనను కలుసుకొని నూతన ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, వైస్ చైర్మన్ మోటుపల్లి బాపిరాజు, డైరెక్టర్లు దుశ్శాలువాలు, పూల మాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. వెంకటేశ్వరస్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. పెందుర్తి రామలక్ష్మి, మెడింటి సూర్యప్రకాశరావు, చిర్ల రామచంద్రారెడ్డి, చోడె పాపారావు, బొబ్బా సుకన్య, ఒబిలిసేని మున్ని ప్రియాంక, బోణం సత్యవేణి, పిల్లా లోకపావణి, రాయి వీర్రాజు, నామాల చంద్రకళ, ఆండ్ర దేవి, మాసగిరి బుల్లెమ్మ, మత్తాల మధుసూధన రావులు డైరెక్టర్లుగా నియమించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మాజీ కౌన్సిలర్ గుత్తుల గోవిందు, చాపల వీరబాబు, పెందుర్తి ప్రదీప్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల క్రీడల్లో కపిలేశ్వరపురానికి గుర్తింపు


జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన మహిళా ఉద్యోగులను అభినందిస్తున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం: జిల్లా స్థాయి రెవెన్యూ ఉద్యోగుల స్పోర్ట్స్‌లో కపిలేశ్వరపురం ఉద్యోగులు ప్రతిభ కనబర్చారు. త్రోబాల్ క్రీడలో మండలంలోని పలు సచివాలయాల పరిధిలోని మహిళా ఉద్యోగులు జిల్లా స్థాయి పోటీలో ప్రథమ స్థానాన్ని సాధించారు. ఇటీవల నిర్వహించిన పోటీలో ప్రతిభ కనబర్చిన మహిళా రెవెన్యూ ఉద్యోగులను మంగళవారం కపిలేశ్వరపురంలో తహసీల్దార్ చిన్నారావు ఇతర అధికారులు అభినందించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

మండపేట: పట్టణంలోని సైథిల్‌పేటకు చెందిన కోసూరి నరసింహమూర్తి కనిపించకపోవడంపై తన రెండో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. టౌన్ ఏ ఎస్ఐ చిన్నారావు తెలిపిన వివరాలిల ప్రకారం సైథిల్‌పేటలో వీధిలో నివాసముంటున్న నరసింహమూర్తికి 17 ఏళ్ల క్రితం ఓ మహిళతో వివాహమైంది. ఇద్దరు కుమార్తెలున్నారు. అయితే మొదటి భార్యకు విడాకులు ఇచ్చి సత్యవతి అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. మద్యానికి బానిసైన ఇతడు తలకుమించిన అప్పులు చేశాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 10న ఎవరి వద్దనైనా అప్పుచేసి సొమ్ము పట్టుకుని వస్తానని భార్య సత్యవతికి చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఇంకా తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం బంధువులు, తెలిసిని వారి ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియలేదు. సత్యవతి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ చిన్నారావు తెలిపారు.